స్మార్ట్ ఫోన్లకు బానిసలయ్యాం!

- రోజుకు 5 గంటలు గడుపుతున్న భారతీయులు
- విస్తరిస్తూ..ఆకర్షిస్తున్న సోషల్, డిజిటల్ మీడియా

న్యూఢిల్లీ, మార్చి 28: భారతీయుల్లో చాలా మంది స్మార్ట్ ఫోన్లకు బానిసలయ్యారు. రోజుకు ఐదారు గంటలు సోషల్ మీడియాకే అంకితమైపోతున్నారు. గ్లోబల్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ ఈవై విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం 2024లో భారతీయులు గతంలో ఎన్నడూ లేని విధంగా స్మార్ట్‌ఫోన్ల పైన వెచ్చించే ఐదు గంటల్లో దాదాపు 70 శాతం సమయాన్ని సోషల్ మీడియా, వీడియో స్ట్రీమింగ్, గేమింగ్‌కే కేటాయిస్తున్నట్టు నివేదిక పేర్కొంది. మొట్టమొదటి సారి డిజిటల్ ప్లాట్‌ఫారాలు టెలివిజన్‌ను కూడా అధిగమించిన విషయాన్ని ఈ నివేదిక ప్రస్తావించింది. భారతీయుల ఆన్‌లైన్‌లో గడుపుతున్న సమయం పెరుగుతుండడంతో మెటా, అమెజాన్ వంటి ప్రపంచ టెక్ దిగ్గజాల మధ్య పోటీ కూడా పెరుగుతోంది. ఒకపక్క డిజిటల్ మీడియా వ్యాపారం విస్తరిస్తుండగా టెలివిజన్, ప్రింట్, రేడియో వంటి సంప్రదాయ మీడియా రెవెన్యూ, మార్కెట్ వాటా 2024లో దిగజారడం గమనార్హమని ఆ నివేదిక వెల్లడించింది.

మన స్క్రీన్ టైమ్ రికార్డులివి...!

- స్మార్ట్ ఫోన్ యూజర్ల సంఖ్య – 120 కోట్లు
- ఇంటర్నెట్ వినియోగదారులు – 85 కోట్లు
- నిరుడు భారతీయులు స్మార్ట్‌ఫోన్లలో గడిపిన మొత్తం కాలం – 1.1 లక్షల కోట్ల గంటలు
- ఎక్కువగా చూస్తున్నది – సోషల్ మీడియా, గేమింగ్, వీడియోలు
- 5జీ నెట్‌వర్క్ యూజర్లు వాడుతున్న నెట్– నెలకు సుమారు 21.2 జీబీ
- ప్రపంచంలో రోజువారీ స్క్రీన్ టైమ్‌లో భారత్ ర్యాంక్ – 3

అవకాశాలు అంతులేవు

- జియో హాట్‌స్టార్, నెట్‌ఫ్లిక్స్ వంటి వాటికి 100 మిలియన్ల పెయిడ్ యూజర్లు పెరిగారు.
- కంటెంట్‌ను యూజర్లు వీక్షించేలా చేయడంలో కృత్రిమ మేధ కూడా తన వంతు పాత్ర పోషిస్తున్నది.
- సోషల్ మీడియా మార్కెటింగ్, బ్రాండింగ్ ప్రజాదరణ పొందుతున్నది.

కర్ణాటక ప్రజలకు విద్యుత్తు వాత

ఫిక్స్‌డ్ చార్జి పెంపు.. బిల్లుపై 7 శాతం భారం

బెంగళూరు: కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం జనానికి మరో ధరల వాత పెట్టింది. సర్‌చార్జి, ఫిక్స్‌డ్ చార్జి, యూనిట్ చార్జి అంటూ రకరకాల జిమ్మిక్కులతో మొత్తం మీద విద్యుత్తు బిల్లు మీద నెలకు అదనంగా 7 శాతం వసూలు చేయడానికి రంగం సిద్ధం చేసింది. కర్ణాటక విద్యుత్తు నియంత్రణ కమిషన్ (కేఈఆర్‌సీ) విడుదల చేసిన ఆదేశాల ప్రకారం, గృహ, పారిశ్రామిక వినియోగదారులకు ప్రతి యూనిట్‌కు విద్యుత్తు చార్జిని తగ్గించారు. అయితే, ఫిక్స్‌డ్ చార్జి రూ.25 పెరిగింది. రిటెయిల్ పవర్ టారిఫ్‌ను 7 శాతం పెంచాలని విద్యుత్ కంపెనీలుకోరడంతో ఈ నిర్ణయం తీసుకుంది. 3 కేడబ్ల్యూతో నెలకు 250 యూనిట్ల విద్యుత్తును వినియోగించే గృహ వినియోగదారులు మార్చి 31 వరకు రూ.1,900 చెల్లిస్తే, ఏప్రిల్ 1 నుంచి రూ.90 సర్‌చార్జితో రూ.2,000కు పైగా చెల్లించాల్సి ఉంటుంది.

‘ఘిబ్లీ’ సృజన అదరహో

- ప్రభంజనం సృష్టిస్తున్న ఓపెన్ ఏఐ కొత్త ఫీచర్
- నెట్టింట బంధుమిత్రుల ఫొటోలతో మీమ్స్ వెల్లువ
- జీపీయూలు కరిగిపోతున్నాయన్న శామ్ ఆల్ట్‌మన్
- తాత్కాలికంగా పరిమిత వినియోగానికే అనుమతి

న్యూఢిల్లీ: ఓపెన్ ఏఐ చాట్‌జీపీటీలో విడుదలైన తాజా ఇమేజ్ జనరేటర్ స్టూడియో ఘిబ్లీ ఆన్‌లైన్‌లో మీమ్స్ ప్రభంజనాన్ని సృష్టిస్తున్నది. యూజర్లు తమ కుటుంబ సభ్యులు, మిత్రులు, ఇతరుల ఏఐ జనరేటెడ్ చిత్రాలతో సామాజిక మాధ్యమాలను నింపేస్తున్నారు. వీటిని ఘిబ్లీ స్టైల్ ఇమేజెస్ అంటున్నారు. ఈ ట్రెండ్‌ను ఒడిసి పట్టుకోవడానికి వ్యాపార సంస్థలు కూడా తమ కంటెంట్‌ను ఈ పద్ధతిలోనే ప్రమోట్ చేసుకుంటున్నాయి. బుధవారం విడుదలైన ఈ ఇమేజ్ జనరేటర్ ప్రముఖ జపనీస్ యానిమేషన్ స్టూడియో ‘స్టూడియో ఘిబ్లీ’ స్ఫూర్తితో ఆర్ట్ వర్క్‌ను సృష్టిస్తుంది. ఈ ఫీచర్ వల్ల యూజర్లు తమ సృజనాత్మకతతో సృష్టించే కంటెంట్ ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాలను ముంచెత్తుతున్నది.

ఘిబ్లీ అంటే...

ఎడారి వేడి గాలిని సూచించే లిబియన్ అరబిక్ పదం నుంచి ఘిబ్లీ అనే పదం వచ్చింది. జపనీస్ యానిమేషన్ స్టూడియో ఘిబ్లీని 1985లో హయావో మియాజకి, ఇసావో టకహట, తోషియో సుజుకి స్థాపించారు. చేతితో గీచే యానిమేషన్, సంక్లిష్టమైన బ్యాక్‌గ్రౌండ్స్, భావోద్వేగపూరితమైన కథనాలకు ఈ స్టూడియో ప్రసిద్ధి పొందింది. ఈ యానిమేషన్ చిత్రాలకు ప్రపంచవ్యాప్తంగా గొప్ప ఫాలోయింగ్ ఉంది.

పరిమిత సేవలు

ఈ ట్రెండ్ విపరీతంగా కొనసాగుతుండటంతో ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ గురువారం మాట్లాడుతూ, యూజర్లు అత్యధికంగా ఘిబ్లీని వాడుతుండటంతో తమ కంపెనీ వనరులు ప్రభావితమవుతున్నాయని చెప్పారు. జీపీయూలు కరిగిపోతున్నాయన్నారు. ఈ ఫీచర్‌కు తాత్కాలికంగా స్పీడ్ లిమిట్స్ పెడుతున్నట్లు తెలిపారు. ఈ ఇమేజ్ జనరేటర్‌ను ఉచితంగానే అందించనున్నట్లు ఆయన మొదట్లో ప్రకటించారు.

భయానక భూకంపం

- మయన్మార్, బ్యాంకాక్‌లను వణికించిన భూకంపం
- రిక్టర్ స్కేల్‌పై 7.7, 6.8 తీవ్రతతో వరుస ప్రకంపనలు
- సుమారు 150 మంది పౌరుల దుర్మరణం.. 730 మందికి పైగా గాయాలు
- కుప్పకూలిన పలు భవనాలు.. భయంతో పరుగులు తీసిన ప్రజలు
- రెండు దేశాల్లో అత్యవసర స్థితి ప్రకటించిన ప్రభుత్వాలు

బ్యాంకాక్‌లో కుప్పకూలిన నిర్మాణంలో ఉన్న ఓ బహుళ అంతస్తుల భవనం

న్యూఢిల్లీ: మయన్మార్, దాని పొరుగున వున్న థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌ను భారీ భూకంపాలు వణికించాయి. రిక్టర్ స్కేల్‌పై 7.7, 6.8 తీవ్రతతో శుక్రవారం మధ్యాహ్నం రెండుసార్లు వెంటవెంటనే ప్రకంపనలు సంభవించాయి. ఈ ఘటనల్లో సుమారు 150 మంది మరణించగా, 730 మందికిపైగా గాయపడ్డారని మయన్మార్ అధికారిక మీడియా ఎంఆర్‌టీవీ వెల్లడించింది. మృతుల సంఖ్య ఇంకా పెరగవచ్చునని భావిస్తున్నారు. దీంతో మయన్మార్ ప్రభుత్వం అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. సాగింగ్ నగర వాయువ్యంలో 16 కి.మీ దూరంలో 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్టు యూఎస్ జియలాజికల్ సర్వే అధికారులు గుర్తించారు. భూకంపం కారణంగా మయన్మార్ రాజధాని నేపిడాలో 1000 పడకల దవాఖాన కుప్పకూలిపోయింది. పేరు పెట్టని ఈ దవాఖానలో మృతుల సంఖ్య అధికంగా ఉండవచ్చునని భావిస్తున్నారు. అలాగే మండాలేలో భక్తులు ప్రార్థనల్లో ఉండగా ఒక మసీదు కూలింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించారు. భూకంప ప్రకంపనలు పొరుగునే ఉన్న ఉత్తర థాయ్‌లాండ్‌కు కూడా వ్యాపించడంతో బ్యాంకాక్‌లోని కొన్ని మెట్రో, రైలు సర్వీసులను నిలిపివేశారు. థాయ్‌లాండ్ ప్రధాని షినవత్రా బ్యాంకాక్‌లో అత్యవసర పరిస్థితి ప్రకటించారు. భూకంపం కారణంగా బ్యాంకాక్, ఇతర నగరాల్లోని భవనాలు వణికిన దృశ్యాలు భయోత్పాతం కలిగించాయి. చాలాచోట్ల ప్రజలు భయంతో వీధుల్లో పరుగులు తీశారు. వందలాది మంది ఇంకా వీధుల్లోనే ఉండి, ఇళ్లలోకి వెళ్లడానికి భయపడుతున్నారు. బ్యాంకాక్‌లోని చుత్‌చాక్ పరిసరాలలో నిర్మాణంలో ఉన్న 30 అంతస్తుల భవనం నిలువునా కూలిపోయింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించగా, 78 మంది కార్మికులు శిథిలాల కింద చిక్కుకుపోయారు.ఎత్తయిన భవనాల నుంచి, చెరువుల నుంచి నీరు పొంగిపొర్లింది. థాయ్‌లాండ్‌లోని భారతీయులకు +66 618819218 నెంబర్‌తో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్టు భారత ఎంబసీ తెలిపింది. కాగా, మయన్మార్‌లో ఇర్వాడి నదిపై ఉన్న ఒక పాత బ్రిడ్జితో పాటు, కొన్ని నివాస భవనాలు కూలిపోయాయి. మండలే లోని విమానాశ్రయం బాగా దెబ్బతింది. తాంగ్యీ నగరంలోని ఒక ఆశ్రమం, థాయ్‌లాండ్ లోని షాన్ రాష్ట్రం దెబ్బతిన్నాయి.

చైనా, భారత్‌లోనూ ప్రకంపనలు

చైనాలోని యున్నాన్ ప్రాంతంలో కూడా భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 7.9గా నమోదైనట్టు అధికారులు తెలిపారు. ఇక భారత్‌లో మేఘాలయతో పాటు పలు ఈశాన్య రాష్ట్రాలు, చైనాలోని యున్నాన్ ప్రావిన్స్‌లో భూకంపం ప్రభావం కన్పించింది. కోల్‌కతా, బెంగాల్‌లోని కొన్ని ప్రాంతాలతో పాటు మణిపూర్‌లో కూడా స్వల్పంగా 4.44 తీవ్రతతో ప్రకంపనలు నమోదయ్యాయి. బంగ్లాదేశ్‌లోని ఢాకా, చిట్టగాంగ్‌లలో కూడా భూకంపం సంభవించినట్టు అధికారులు తెలిపారు. కాగా, భూకంపం నేపథ్యంలో బాధిత దేశాలకు అవసరమైన సహాయం అందించడానికి భారత్ సిద్ధంగా ఉందని ప్రధాని మోదీ ప్రకటించారు.

నైపేయీలో (మయన్మార్) ధ్వంసమైన ఓ భవనం

కత్తి విసిరిందని కడ తేర్చాడు!

భార్యను నరికిన టెకీ

ముంబై, మార్చి 28(నమస్తే తెలంగాణ): బెంగళూరులో నివసిస్తున్న ఓ 36 ఏండ్ల సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ తన భార్యను హత్య చేసి పుణెకు పారిపోయి ఆత్మ హత్యాయత్నానికి పాల్పడ్డాడు. పుణెకి పారిపోయే ముందు నిందితుడు తన భార్య మృతదేహాన్ని ముక్కలు చేసి సూట్‌కేసులో కుక్కి దొడ్డకన్నహల్లి ప్రాంతంలోని తన ఫ్లాట్‌లో వదిలివెళ్లాడు. పోలీసులు దాన్ని స్వాధీనం చేసుకున్నారు. రాకేష్‌ను పుణెలో పోలీసులు అరెస్టు చేశారు. మహారాష్ట్రకు చెందిన 32 ఏళ్ల గౌరీతో రాకేష్ రాజేంద్రకు వివాహమైంది. మహారాష్ట్రకు చెందిన ఈ దంపతులు ఏడాది కాలంగా బెంగళూరులో నివసిస్తున్నారు.

జస్టిస్ వర్మ అలహాబాద్ హైకోర్టుకు బదిలీ

న్యూఢిల్లీ : పెద్ద ఎత్తున నగదు వ్యవహారానికి సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను కేంద్రం అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసింది. శుక్రవారం ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. జస్టిస్ వర్మకు న్యాయపరమైన విధులను ప్రస్తుతానికి అప్పగించవద్దని అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సుప్రీంకోర్టు ఆదేశించింది. కాగా, జస్టిస్ యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయడాన్ని తీవ్రంగా విమర్శించిన ఆ రాష్ట్ర హైకోర్ట్ బార్ అసోసియేషన్ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బహిష్కరించింది.

కామ్రాకు మధ్యంతర ముందస్తు బెయిల్

ఆనంద్ మహీంద్రాపై తాజాగా సెటైర్లు

న్యూఢిల్లీ: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, శివసేన అధినేత ఏక్‌నాథ్ షిండేను లక్ష్యంగా చేసుకుని విడుదల చేసిన తాజా వీడియో వివాదాస్పదమైన నేపథ్యంలో స్టాండప్ కమెడియన్ కుణాల్ కామ్రాకు మద్రాస్ హైకోర్టు ఏప్రిల్ 7వ తేదీ వరకు మధ్యంతర ముందస్తు జామీను మంజూరు చేసింది. జస్టిస్ సుందర్ మోహన్ శుక్రవారం షరతులతో కూడిన మధ్యంతర ముందస్తు బెయిలు మంజూరు చేశారు. ముంబై పోలీసులు తనను అరెస్టు చేసే అవకాశం ఉందని తెలియచేస్తూ తనకు ట్రాన్సిట్ ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కామ్రా హైకోర్టును ఆశ్రయించారు. తాను 2021లో ముంబై నుంచి తమిళనాడుకు వచ్చానని, అప్పటి నుంచి తాను ఈ రాష్ట్ర పౌరుడినేనని కునాల్ పిటిషన్‌లో పేర్కొన్నారు. మరోవైపు ఈ సారి ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రాను ఆయన టార్గెట్ చేశారు.

సున్నితమైన రక్షణ డాటా లీక్

ఓ పరికరం నుంచి హ్యాకర్ల దొంగతనం

న్యూఢిల్లీ, మార్చి 28: రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ ‘డీఆర్‌డీవో’కు సంబంధించి సున్నితమైన రక్షణ సమాచారం లీకైందని సైబర్ సెక్యూరిటీ సంస్థ ‘ఎథీనియన్ టెక్’ తేల్చింది. డీఆర్‌డీవో మాజీ ఉద్యోగి పరికరం నుంచి ఆ సమాచారాన్ని హ్యాకర్లు దొంగలించారని, లీకైన డాటాలో అత్యంత రహస్య పత్రాలు, ఆయుధ రూపకల్పనలో సున్నితమైన రక్షణ సమాచారం ఉందని ఎథీనియన్ నివేదిక పేర్కొన్నది. ఓ హ్యాకర్ గ్రూప్ డీఆర్‌డీవో సమాచారాన్ని దొంగలించి..శాంపిల్‌గా కొంత డాటాను బయటపెట్టింది. సమాచారంలో అత్యధిక భాగం డీఆర్‌డీవో మాజీ అధికారి పనీత్ అగర్వాల్‌కు చెందిన పరికరంలోనిదేనని‘ఎథీనియన్’తేల్చింది.

డల్లేవాల్ నిజమైన రైతు నాయకుడు

దీక్ష విరమణపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, మార్చి 28: జగ్జిత్ సింగ్ డల్లేవాల్ ఆమరణ నిరాహార దీక్షను విరమించటంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు హర్షం వ్యక్తం చేశారు. ఎలాంటి రాజకీయ ఎజెండా లేని, నిజమైన రైతు నాయకుడు జగ్జిత్ సింగ్ డల్లేవాల్..అంటూ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటిశ్వర్ సింగ్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఖనౌరీ, శంభూ సరిహద్దులో రైతులు చేపట్టిన నిరాహార దీక్షకు ముగింపు పలికామని, నిరసనకారులను పంపించివే శామని పంజాబ్ ఏజీ కోర్టుకు తెలిపారు.

కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు

ప్రజా ధనం దుర్వినియోగం చేశారని ఆరోపణలు

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో 2019లో భారీ హోర్డింగులు ఏర్పాటు చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఇతరులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు ఢిల్లీ పోలీసులు శుక్రవారం కోర్టుకు తెలిపారు. అదనపు చీఫ్ జుడిషియల్ మెజిస్ట్రేట్ నేహా మిట్టల్ ఎదుట దాఖలు చేసిన స్టేటస్ నివేదికలో ఢిల్లీ పోలీసులు ఈ విషయాన్ని పేర్కొన్నారు. ప్రివెన్షన్ ఆఫ్ డిఫేస్‌మెంట్ ఆఫ్ ప్రాపర్టీ యాక్ట్ ఉల్లంఘన జరిగినట్టు వచ్చిన ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని మార్చి 11న ఢిల్లీ పోలీసులను జడ్జి ఆదేశించారు. కేసు విచారణను కోర్టు ఏప్రిల్ 18వ తేదీకి వాయిదా వేసింది.

డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తూ విజయ్ పార్టీ తీర్మానం

చెన్నై: జాతీయ విద్యావిధానంలోని త్రిభాషా సూత్రం, నియోజక వర్గాల పునర్విభజన అంశాలపై కేంద్రం, కొన్ని రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదం నడుస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే వీటిని వ్యతిరేకిస్తూ తమిళ సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం పార్టీ (టీవీకే) శనివారం తీర్మానాలను ఆమోదించింది. శుక్రవారం తిరువన్మయూర్‌లో తొలి జనరల్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిండంతోపాటు మొత్తం 17 తీర్మానాలను ఆ పార్టీ ఆమోదించింది.

‘జెలెన్‌స్కీని తొలగించాలి’

మాస్కో: ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని తొలగించి అధికార మార్పిడి చేపట్టాలని రష్యా అధ్యక్షుడు పుతిన్ పిలుపునిచ్చారు. ఉక్రెయిన్ సైనిక బలగాలను రష్యా సైన్యం సమూలంగా అంతం చేస్తుందని ఆయన ప్రకటించారు. రష్యా–ఉక్రెయిన్ మధ్య కాల్పుల విరమణ కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చర్చలు జరుపుతున్న వేళ పుతిన్ నుంచి ఈ ప్రకటన వెలువడడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

వైద్యం అస్తవ్యస్తం

- సరిపడా డాక్టర్లూ, నర్సులూ, పడకలు కరువు
- మోదీ సొంత రాష్ట్రంలో అన్ని సేవలూ అరకొరే
- కడిగేసిన కాగ్.. నిధులు 8%పెంపునకు సిఫారసు

డబుల్ ట్రబుల్ ఇంజిన్

గాంధీనగర్, మార్చి 28: దశాబ్దాలుగా బీజేపీ పాలిస్తున్నప్పటికీ గుజరాత్‌లో వైద్య రంగం అస్తవ్యస్తంగా ఉంది. ‘అక్కడి దవాఖానల్లో వైద్యులు, నర్సులు సరిపడా లేరు. కనీసం రోగులకు అవసరమైన పడకలు కూడా లేవు. సమగ్రమైన ఆరోగ్య విధానం లేక, ఆరోగ్య రంగమంతా అనేక లోపాలతో నిండి ఉంది.’అని భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తీవ్రంగా వ్యాఖ్యానించింది. ముఖ్యంగా అత్యవసర విభాగాలైన ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లు, బ్లడ్ బ్యాంక్‌లలో కూడా సేవలు సరిగ్గా లేవంటూ పలు లోపాలను ఎత్తిచూపింది. ఆరోగ్య సేవల ప్రజారోగ్య మౌలిక సదుపాయాలపై కాగ్ తన నివేదికను శుక్రవారం అసెంబ్లీ ముందు ఉంచింది.

బోధనా సిబ్బంది కొరతే..

రాష్ట్రంలో 22 జిల్లాల్లో 25 శాతం డాక్టర్లు, 19 జిల్లాల్లో 25 శాతం కన్నా ఎక్కువ పారా మెడికల్ సిబ్బంది కొరత ఉన్నట్టు కాగ్ తన నివేదికలో వెల్లడించింది. ప్రస్తుతం బడ్జెట్‌లో ఈ రంగానికి 5.4 శాతం నిధులు ఇచ్చారని, అయితే జాతీయ ఆరోగ్య విధానం సిఫార్సు మేరకు రాష్ట్ర బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి 8 శాతం నిధులు కేటాయించాలని కాగ్ సూచించింది. మానవ వనరుల నిర్వహణకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఎలాంటి విధానాన్ని రూపొందించ లేదని కాగ్ తప్పు బట్టింది. 2016–22 మధ్య 9,983 మంది ఆరోగ్య సిబ్బందిని నియమించినప్పటికీ డాక్టర్లు, నర్సులు, పారా సిబ్బంది కొరత వరుసగా 23, 6, 25 శాతం ఉందని తెలిపింది. ప్రత్యేక డాక్టర్ పోస్టులు సబ్ డిస్ట్రిక్ట్స్ దవాఖానలలో 51 శాతం, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలలో 49 శాతం ఖాళీగా ఉన్నాయని పేర్కొంది. ఇక జాతీయ ఆరోగ్య మిషన్ పథకం కింద 31 శాతం ప్రత్యేక డాక్టర్లు, 32 శాతం పారా మెడికల్ సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాలేజీలు/స్కూళ్లలో 76 శాతం బోధనా సిబ్బంది కొరత ఉందని కాగ్ తెలియజేసింది.

ఆత్మాహుతి డ్రోన్ పరీక్ష సక్సెస్

సైనికుల కోసం సైనికులు అభివృద్ధి చేసిన ఆయుధం

పఠాన్‌కోట్: యుద్ధ వ్యూహాల్లో చెప్పుకోదగ్గ ముందడుగు పడింది. భారత సైన్యంలోని ఫ్లూర్–డీ–లిస్ బ్రిగేడ్ విజయవంతంగా ఆత్మాహుతి దాడి చేయగల ఫస్ట్ పర్సన్ వ్యూ (ఎఫ్‌పీవీ) డ్రోన్‌ను పరీక్షించింది. ఇది ట్యాంకుల విధ్వంసకర ఆయుధ సామగ్రిని పైలట్ మార్గదర్శకత్వంలో మోసుకొనిపోగలదు. భారత సైన్యానికి ఇటువంటి డ్రోన్ అందుబాటులోకి రానుండటం ఇదే మొదటిసారి. సైనికుల కోసం సైనికులు రూపొందించిన ఈ ఆయుధాన్ని పఠాన్‌కోట్ సెక్టార్‌లో పరీక్షించారు. అధునిక యుద్ధ సామగ్రిలో తక్కువ ఖర్చు, అత్యధిక ప్రభావం చూపగలిగే గగనతల దాడుల వ్యవస్థలను అనుసంధానం చేసే దిశగా ఇది గొప్ప ముందడుగు. శత్రువుల ఆయుధాలను అత్యంత కచ్చితత్వంతో కూల్చగలిగే సత్తా వీటికి ఉంది.

భావ ప్రకటనను గౌరవించాల్సిందే

- అభిప్రాయాల వ్యక్తీకరణ ప్రజాస్వామిక హక్కు
- ఎందరు వ్యతిరేకించినా.. దాన్ని గౌరవించాల్సిందే
- నచ్చని అభిప్రాయాలను ప్రతివాదనలతో ఎదుర్కోవాలి అంతేగానీ.. అణచివేతతో ఎదుర్కోవడం సబబు కాదు
- ప్రాథమిక హక్కులను రక్షించడం కోర్టులు, పోలీసుల విధి
- భావ ప్రకటన స్వేచ్ఛపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, మార్చి 28/(స్పెషల్ టాస్క్ బ్యూరో): వ్యక్తులు వ్యక్తపరిచే భిన్నమైన అభిప్రాయాలను ప్రతివాదనలతో ఎదుర్కోవాలే తప్ప అణచివేతతో కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వ్యక్తుల భావ ప్రకటన ప్రజాస్వామిక హక్కు అన్న అత్యున్నత న్యాయస్థానం.. ఆ హక్కును అందరూ తప్పకుండా గౌరవించాల్సిందేనని తేల్చి చెప్పింది. అలాగే ప్రాథమిక హక్కుల్లో భాగమైన వ్యక్తుల భావ ప్రకటనను పరిరక్షించడం న్యాయస్థానాలతో పాటు పోలీసుల విధి అని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం భావ ప్రకటన స్వేచ్ఛపై పలు కీలక వ్యాఖ్యలు చేసింది.

అసలేమిటీ కేసు?

గుజరాత్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ ఓ పెండ్లి వేడుక మధ్యలో నడిచి వస్తుండగా ఆయనపై పూలవర్షం కురిసింది. బ్యాక్‌గ్రౌండ్‌లో ఓ పద్యం వినిపించింది. ఈ వీడియోను ఆయన గత డిసెంబర్‌లో సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అయితే, బ్యాక్‌గ్రౌండ్‌లో వినిపించిన పద్యంలోని కొన్ని పదాలు రెచ్చగొట్టేలా.. మత విశ్వాసాలు, సామరస్యాన్ని, జాతి ఐక్యతను విచ్ఛిన్నం చేసేలా, సమాజంలో ఘర్షణలు, అశాంతి రేకెత్తించేలా ఉన్నాయంటూ ఆయనపై గుజరాత్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దీనిపై విచారించిన ధర్మాసనం భావ ప్రకటన స్వేచ్ఛపై పలు కీలక వ్యాఖ్యలు చేస్తూనే.. గుజరాత్ పోలీసుల అత్యుత్సాహంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎంపీపై నమోదు చేసిన కేసును కొట్టివ్యాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. స్టాండప్ కమెడియన్ కుణాల్ కామ్రా చేసిన వ్యాఖ్యలపై కేసు నమోదైన నేపథ్యంలో సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి.

విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు

- ఒక వ్యక్తి లేదా సమూహం వ్యక్తపరిచే అభిప్రాయాలను ఎక్కువ మంది వ్యతిరేకించినా సరే.. ఆ వ్యక్తి భావ ప్రకటనా స్వేచ్ఛను తప్పనిసరిగా గౌరవించాలి.
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1) (వాక్ స్వాతంత్ర్య స్వేచ్ఛ) ఇచ్చిన హక్కులను ఆర్టికల్ 19(2) (వాక్ స్వాతంత్ర్యంపై ఆంక్షలు) ఎన్నడూ మరుగున పడేయకూడదు.
- కవిత్వం, నాటకం, సినిమాలు, వ్యంగ్యం, కళలు, సాహిత్యం వంటివి మనుషుల జీవితాన్ని మరింతగా అర్థవంతం చేస్తాయి. ఆలోచనలు, అభిప్రాయాలను వ్యక్తీకరించే స్వేచ్ఛ లేనప్పుడు.. ఆర్టికల్ 21 కల్పించిన గౌరవప్రదంగా జీవించడం అనే హక్కును సాధించడం అసాధ్యమే అవుతుంది.
- ఆరోగ్యకరమైన ప్రజాస్వామిక వ్యవస్థలో విభిన్న అభిప్రాయాలను లేదా విరుద్ధమైన భావాలను వ్యతిరేకించాలని అనుకుంటే.. వాదనకు ప్రతివాదనతో సమాధానం చెప్పాలి. అంతేకానీ అణచివేతను ప్రయోగించకూడదు.
- ఒకవేళ ఎవరైనా వ్యక్తుల వ్యాఖ్యలపై ఆంక్షలు విధించాల్సి వస్తే.. అవి సహేతుకంగా, ఆమోదయోగ్యంగా ఉండాలి.
- వ్యక్తుల వాక్ స్వాతంత్ర్యం అనేది ప్రజాస్వామ్య వ్యవస్థలో అంతర్భాగం. దాన్ని రక్షించడం, ప్రజల ప్రాథమిక హక్కులను కాపాడటం న్యాయస్థానాలతో పాటు పోలీసుల విధి.
- రాజ్యాంగం, దాని ఆదర్శాలను కాపాడాల్సిన బాధ్యత న్యాయమూర్తులమైన మనపై కూడా ఉంది.

పక్షవాతానికి స్టెమ్ సెల్ చికిత్స

జపాన్‌లో సానుకూల ఫలితాలు

టోక్యో: పక్షవాతానికి స్టెమ్ సెల్ చికిత్సతో ప్రయోజనాలు కనిపించాయి. క్లినికల్ ట్రయల్స్‌లో పాల్గొన్న నలుగురిలో ఇద్దరికి కొంత ఉపశమనం దొరికింది. వెన్నెముక గాయానికి చికిత్సలో భాగంగా వారికి న్యూరల్ స్టెమ్ సెల్స్ ఇంజెక్షన్ చేశారు. నడవలేని స్థితిలో అనేక సంవత్సరాల నుంచి బాధపడుతున్న ఒక రోగి లేచి, నిల్చోగలిగారు. నడవడానికి ఆయనకు శిక్షణ ఇస్తున్నారు. మరో వ్యక్తి ఈ చికిత్సతో చేతులు, కాళ్లు కదపగలుగుతున్నారు. జపాన్‌లోని కీయో యూనివర్సిటీ స్టెమ్ సెల్ శాస్త్రవేత్త హిడెయుకి, ఇతర శాస్త్రవేత్తలు ఈ ప్రయోగాన్ని నిర్వహించారు. ఈ చికిత్స సురక్షితమైనదని చెప్పారు. స్టెమ్ సెల్స్ అంటే శరీరంలోని ప్రత్యేకమైన సెల్స్. ఇవి చర్మం, కండరాలు లేదా బ్లడ్ సెల్స్ వంటి వేర్వేరు రకాల సెల్స్‌గా మారుతాయి.

నిద్ర లేమికి యోగాతో చెక్!

- శాంభవి ముద్రతో నాణ్యమైన, గాఢ నిద్ర
- హార్వర్డ్ విశ్వవిద్యాలయం అధ్యయనం

న్యూఢిల్లీ: నిద్ర లేమితో బాధపడేవారికి యోగాసనాలు ఉపశమనం కలిగిస్తాయని అమెరికాలోని హార్వర్డ్ మెడికల్ స్కూల్ క్లినికల్ ట్రయల్స్ వెల్లడించాయి. చండీగఢ్‌లోని పీజీఐ సహకారంతో ఈ